యూనివర్సిటీ పనుల్లో విద్యార్థుల అభిప్రాయాలకు ప్రాధాన్యం

- ఉస్మానియా చారిత్రక భవనాలను సంరక్షిస్తూనే నూతన భవనాల నిర్మాణం
- ఈ నెలాఖరు నాటికి అభివృద్ధి పనులపై తుది నిర్ణయం
- సమీక్షలో సిఎం ఎ రేవంత్ రెడ్డి
- 10న యూనివర్సిటీని సందర్శించనున్న ముఖ్యమంత్రి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా యూనివర్సిటీలో చేపట్టనున్న అభివృద్ధి పనుల్లో విద్యార్థులు, బోధనా సిబ్బంది అభిప్రాయాలకు ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి సూచించారు. యూనివర్సిటీ అభివృద్ధి పనులపై తన నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్షించారు. ఉస్మానియా యూనివర్సిటీలో చేపట్టనున్న అభివృద్ధి పనులపై తొలుత అధికారులు సిఎంకు వివరించారు. అనంతరం పనులకు సంబంధించిన వివిధ మోడళ్ల పవర్ పాయింట్ ప్రజెంటేషన్ను వీక్షించారు. హాస్టల్ భవనాలు, రహదారులు, అకడమిక్ బ్లాక్స్, ఆడిటోరియం నిర్మాణాలకు సంబంధించి పలు మార్పులు, చేర్పులను సిఎం సూచించారు. యూనివర్సిటీ పరిధిలోని అటవీ ప్రాంతంలో పనులకు అర్బన్ ఫారెస్ట్ నిధులు వినియోగించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను సిఎం సూచించారు. యూనివర్సిటీ పరిధిలో ఖాళీగా ఉన్న జల వనరులను సంరక్షిస్తూనే నూతన జల వనరుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సిఎం సూచించారు. హాస్టల్, అకడమిక్ భవనాల నిర్మాణం విషయంలో వంద మంది విద్యార్థులుంటే అదనంగా మరో పది శాతం మంది విద్యార్థులకు వసతులు ఉండేలా చూడాలని తెలిపారు. విద్యార్థులు, సిబ్బంది భవిష్యత్తులోనూ ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా నిర్మాణాలు ఉండాలని అన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధి పనులకు సంబంధించి ఎంత మొత్తమైనా ఖర్చు చేసేందుకు వెనుకాడబోమని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి తెలిపారు. యూనివర్సిటీ పరిధిలోని చారిత్రక, వారసత్వ భవనాలను సంరక్షించాలని సిఎం సూచించారు. చారిత్రక ప్రాధాన్యం లేని పురాతన భవనాలకు భారీ మొత్తాలు వెచ్చించి మరమ్మతులు చేసే బదులు నూతన భవనాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సైకిల్ ట్రాక్లు, వాకింగ్ పాత్లతో పాటు ప్రతి పనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. ఉస్మానియా విద్యార్థుల పోరాట ప్రతిమను ప్రతిబింబించే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉస్మానియా యూనివర్సిటీని ఈ నెల 10న సందర్శించనున్నట్లు సిఎం తెలిపారు. అకడమిక్ బ్లాక్లు, హాస్టళ్లను పరిశీలిస్తానని తెలిపారు. యూనివర్సిటీ అభివృద్ధి పనులకు సంబంధించి విద్యార్థులు, బోధనా సిబ్బంది అభిప్రాయాలు స్వీకరించాలని అధికారులను సూచించారు. తొలుత అభివృద్ధి నమూనాలు వారి ముందు ఉంచాలని, తర్వాత వారి అభిప్రాయాలు తెలిపేందుకు డ్రాప్ బాక్సుల ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక వెబ్సైట్ను ఏర్పాటు చేయాలని సూచించారు. వారి అభిప్రాయాలకు ప్రాధాన్యమిస్తూ ఈ నెలాఖరు నాటికి అభివృద్ధి ప్రణాళికలపై తుది నిర్ణయం ఖరారు కావాలని సిఎం తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఉస్మానియా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మొలుగారం కుమార్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం తదితరులు పాల్గొన్నారు.

సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి సిఎం విరాళం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి రూ.లక్ష విరాళం అందజేశారు. శుక్రవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్లోని ముఖ్యమంత్రి నివాసంలో సైనిక్ వెల్ఫేర్ ప్రతినిధులు సిఎంను కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి బోల్డ్ అండ్ బ్రేవ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కల్నల్ రమేష్ కుమార్, కెప్టెన్ శ్రీనేష్ కుమార్, కెప్టెన్ నరోత్తమ్ రెడ్డి, కెప్టెన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

హెల్త్ యూనివర్సిటీ ఇన్చార్జి విసిగా డాక్టర్ రమేశ్రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఇన్చార్జి విసిగా డాక్టర్ రమేశ్రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రమేశ్ రెడ్డి ప్రస్తుతం యాదాద్రి భువనగిరి ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్గా పనిచేస్తున్నారు. గతంలో ఈయన డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ)గా పని చేసిన సంగతి తెలిసిందే. కాళోజీ హెల్త్ యూనివర్సిటీ విసి పోస్టులో ఇప్పటివరకు ఉన్న డాక్టర్ నందకుమార్రెడ్డి చేరినప్పటి నుంచి వర్సిటీలో అక్రమాలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలు బలంగా ఉన్న విషయం విదితమే. పిజి పరీక్షల్లో ఫెయిలైన ప్రయివేటు మెడికల్ కాలేజీలకు చెందిన కొందరు విద్యార్థులను పాస్ చేయించారనే ప్రచారం జోరుగా సాగుతున్నది. ఇన్చార్జుల నియామకంలో ఇష్టానుసారంగా వ్యవహరించారనే విమర్శ ఉంది. యూనివర్సిటీ ప్రతిష్ట మసకబారుతోందనే ఆరోపణలు వెల్లువెత్తడంతో అక్రమాలపై విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. అది జరుగుతుండగానే నందకుమార్రెడ్డి గత నెల 28న విసి పదవికి రాజీనామా చేశారు. తిరిగి మరుసటి రోజే తిరిగి విధుల్లో చేరి, కొత్త విసి వచ్చే వరకు తననే ఆపద్ధర్మ విసిగా కొనసాగమన్నారని ఆయనే మీడియాకు చెప్పారు. తాను తప్పుచేయలేదనీ, ఎటువంటి విచారణకైనా సిద్ధమేనని పేర్కొన్న సంగతి తెలిసిందే.

మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

- తెలంగాణను ఆ దిశగా నిలిపేందుకే గ్లోబల్ సమ్మిట్
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణను 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ తీర్చిదిద్దడమే లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025ని నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సుమారు 200 బిలియన్ డాలర్ల వద్ద ఉందని, వచ్చే రెండు దశాబ్దాల్లో 15 రెట్లు పెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యానికి గ్లోబల్ సమ్మిట్ ప్రధాన వేదికగా నిలువబోతున్నదని తెలిపారు. ఆర్థిక బలోపేతంలో వ్యవసాయ రంగం కేంద్ర బిందువుగా ఉండబోతున్నదని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్లోని సచివాలయంలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు ఆదాయం పెరగడం, ఉత్పాదకత పెరుగుదల, విలువ ఆధారిత వ్యవసాయం విస్తరణ, ఎగుమతుల పెంపు ఇవన్నీ 3 ట్రిలియన్ ఆర్థిక లక్ష్యాన్ని సాధించడానికి అత్యంత కీలక అంశాలని వివరించారు. ఐటీ ఆధారిత సూక్ష్మ నీటిపారుదల, నేల ఆరోగ్య నిర్వహణ, అగ్రిటెక్ పరిశోధన, టిఎఆర్సిసి, గ్లోబల్ సీడ్ లీడర్షిప్, హార్టికల్చర్ మెగా క్లస్టర్లు, ఆయిల్ పామ్ విస్తరణ, ఫార్మ్ టూరిజం, ఎఫ్పీఓలను ఫుడ్ డెలివరీ



కంపెనీలతో అనుసంధానం చేయడం, పాలు, మాంసం, మత్స్య రంగాల పెంపు, ఆధునాతన అగ్రి లాజిస్టిక్స్ వంటి కార్యక్రమాలు తెలంగాణ వ్యవసాయాన్ని గ్లోబల్ ప్రమాణాలకు తీసుకెళ్లాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విజన్ 2047 డాక్యుమెంట్ తెలంగాణ వ్యవసాయ రంగానికి ఒక దిశను నిర్దేశిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రైతు సంక్షేమం తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యం అని పునరుద్ఘాటించారు. రైతు భరోసా, రుణమాఫీ, పంట నష్టపరిహారం, రైతు బీమా వంటి పథకాలతో రాష్ట్ర ప్రభుత్వం రైతుల జీవనోపాధిని మెరుగుపరచడంతో పాటు భవిష్యత్తు వృద్ధికి బలమైన పునాది వేసిందన్నారు. ఇకపై సాంకేతికత, డేటా, మార్కెట్ ఆధారిత వ్యవసాయ మోడల్ద్వారా రైతులను మరింత సాధికారులను చేస్తామని ప్రకటించారు. సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపి, అగ్రికల్చర్ యూనివర్సిటీ విసి అల్దాస్ జానయ్య, హార్టికల్చర్ యూనివర్సిటీ విసి రాజిరెడ్డి, మార్క్ ఫెడ్ ఎమ్డీ శ్రీనివాస్ రెడ్డి, హెచ్ఎసిఎ ఎండి చంద్రశేఖర్ రెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, పాల్గొన్నారు.

వర్సిటీ విద్యార్థుల నిర్బంధాన్ని ఖండిస్తున్నాం

- సిపిఐ ఎంఎల్సీ నెల్లికంటి సత్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మారేడుమిల్లి ఎన్కౌంటర్పై నిజనిర్ధారణకు వెళ్లిన ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల విద్యార్థులను పోలీసులు అక్రమంగా నిర్బంధించడాన్ని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఖండించారు. శుక్రవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు స్పందిస్తారనీ, అదేవిధంగా మారేడుమిల్లి ఎన్కౌంటర్పై వాస్తవాలను ప్రజలకు తెలిపేందుకు బయలుదేరారని తెలిపారు. అక్కడకు వెళ్లేముందు మావోయిస్టులకు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి, ఆంధ్రప్రదేశ్ డిజిపికి బహిరంగంగానే లేఖలు రాశారని గుర్తు చేశారు. సమాచారం ఇచ్చినా అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీస్ స్టేషన్ పరిధిలో వారు వెళుతున్న వాహనాలను ఆపి స్టేషన్లో నిర్బంధించడం దుర్మార్గమని పేర్కొన్నారు. దీన్ని ప్రజాస్వామిక వాదులందరూ ఖండించాలని కోరారు. ఆ విద్యార్థులను ఎపి ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రత్నప్రభకు బిఎసిసి ప్రతిష్టాత్మక అవార్డు

హైదరాబాద్ : కర్ణాటక మాజీ ప్రధాన కార్యదర్శి, ఉబుంటు కన్సార్టియం వ్యవస్థాపక అధ్యక్షురాలు కె రత్నప్రభకు మలేషియాలోని బ్రిక్స్ ఆసియాన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (బిఎసిసి) ప్రతిష్టాత్మకమైన తున్ డాక్టర్ మహతిర్ మొహమ్మద్ గుడ్ గ్లోబల్ ఎగ్జాంప్లరీ లీడర్షిప్ అవార్డును ప్రదానం చేసింది. బ్రిక్స్ ఆసియాన్ కౌన్సిల్ అధ్యక్షుడు, నైజీరియా రాయబారి థాయలన్ నాథన్ ఈ అవార్డును రత్నప్రభకు అందజేశారు. పాలన, సంస్థాగత బలోపేతం సమాజం కేంద్రీకృత అభివృద్ధికి ఆమె చేసిన అసాధారణ కృషికి గుర్తింపుగా దీనిని అందజేయడం జరిగింది. "అవార్డులతో సంబంధం లేకుండా మేము ఉబుంటు ద్వారా 10,000 మంది మహిళా వ్యవస్థాపకులను చేరుకోవడం, వారికి డిజిటల్ మార్కెటింగ్లో శిక్షణ ఇవ్వడం, వంద సంఘాలకు విస్తరించడం, ఎగుమతులను సులభతరం చేయడం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్థలతో భాగస్వామ్యాలను ఏర్పరచుకోవడం కొనసాగిస్తాము." అని రత్నప్రభ పేర్కొన్నారు.

గ్లోబల్ సమ్మిట్కు రండి

- జార్ఖండ్ సిఎం హేమంత్సోరెన్కు భట్టి ఆహ్వానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్లోని భారత్ ఫ్యూచర్ సిటీలో ఈనెల ఎనిమిది, తొమ్మిది తేదీల్లో తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్-2047 గ్లోబల్ సమ్మిట్కు హాజరు కావాలని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రత్యేకంగా కలిసి ఆహ్వానించారు. శుక్రవారం జార్ఖండ్ సిఎం నివాసంలో జరిగిన ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ముద్రించిన గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన పత్రికను హేమంత్ సోరెన్కు భట్టి విక్రమార్క అందజేశారు. మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధి లక్ష్యంగా తెలంగాణ భవిష్యత్తు సంకల్పంతో ముందుకు సాగుతుందని వివరించారు. దీనికి అనుగుణంగా అన్ని రంగాల వృద్ధి లక్ష్యాలు, అనుసరించే భవిష్యత్తు ప్రణాళికలను విశ్లేషించేలా తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ను రూపొందించామని అన్నారు. నిటిఆయోగ్ సలహాలు, సూచనలతోపాటు అన్ని రంగాల నిపుణుల మేథో మథనంతో తయారు చేసిన ఈ విజన్ డాక్యుమెంట్ను గ్లోబల్ సమ్మిట్లో ఆవిష్కరించనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో జార్ఖండ్ కాంగ్రెస్ ఇంచార్జీ కొప్పుల రాజు, పిసిసి చీఫ్ కేశవ్ మహతో కమలేశ్, మైనార్టీ విభాగం ఉపాధ్యక్షులు సంషేర్ ఆలం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిసిలో యూనియన్లను పునరుద్ధరించాలి

- సిఎంకు స్టాఫ్, వర్కర్స్ యూనియన్ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్టిసిలో యూనియన్లను పునరుద్ధరిస్తామని, కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీలు అమలుచేయాలని ఆర్టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె రాజిరెడ్డి ముఖ్యమంత్రికి లేఖ రాశారు. పిఆర్సి పరిధిలోకి కార్మికులను చేరుస్తామని, పెండింగ్ బకాయిలను చెల్లిస్తామమంటూ కాంగ్రెస్ పార్టీ అభయహస్తం మ్యానిఫెస్టోలో చెప్పిందని గుర్తు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం రావడానికి ఆర్టిసి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు విశేష కృషి చేశారని చెప్పారు. కెసిఆర్ను ఓడించాలనే కసితో ఉద్యోగం పోతుందని తెలిసినా కూడా కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీ గెలుపునకు జీప్ జాత ద్వారా ప్రచారం చేసినట్టు చెప్పారు ఆ తర్వాత ఎఐటియుసి అనుబంధ సంఘమైన ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి ఐఎన్టియుసి అనుబంధ సంఘమైన స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్లో నాతో పాటు ఇతర కార్మికులను కూడా చేర్పించానని చెప్పారు.

తెలంగాణ గ్లోబల్ సమ్మిట్కు సోనియా సందేశం

- రేవంత్ రెడ్డికి అభినందనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

2047 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే దిశలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కీలక భూమిక పోషిస్తుందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియాగాంధీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నెల ఎనిమిది,తొమ్మిదో తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనుండడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్రెడ్డికి సోనియాగాంధీ అభినందనలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి సిఎం చేస్తున్న కృషి విజయవంతం కావాలని సోనియా ఆకాంక్షించారు. తెలంగాణ అభివద్ధికి సంబంధించిన పలు కీలక, ప్రాముఖ్యమైన ప్రాజెక్టులు, ప్రణాళికల్లో భాగస్వాములు కాదల్చిన వారికి ఈ సమ్మిట్ ఒక వేదికను అందిస్తుందని గుర్తుచేశారు. అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ-వ్యవసాయాభివృద్ధి ప్రాజెక్టులకు సమ ప్రాధాన్యం ఇస్తూ మూడంచెల వ్యూహంతో తెలంగాణ ముందుకు సాగుతున్నదని సోనియాగాంధీ ఈ లేఖలో ప్రస్తావించారు. తెలంగాణలోని మానవ, సహజ వనరులు, ప్రజల వ్యాపార నైపుణ్యం, అంతర్జాతీయ ప్రతిభ, సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధికి సమ్మిట్ మరింత తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు. సమ్మిట్లో పాల్గొనే వారందరికీ సోనియా శుభాకాంక్షలు తెలిపారు.

బీమా క్లెయిమ్ ప్రక్రియను సరళతరం చేయడమే లక్ష్యం

- పాలసీబజార్ జాయింట్ గ్రూప్ సిఇఒ సర్బవీర్ సింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్

బీమా క్లెయిమ్ ప్రక్రియను సజావుగా, వేగంగా చేయడం తమ లక్ష్యమని పాలసీబజార్ జాయింట్ గ్రూప్ సిఇఒ సర్బవీర్ సింగ్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్లో పాలసీబజార్ 'ఇన్సూరెన్స్ కా సూపర్ హీరో' నాలుగో ఎడిషన్ను నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్టమర్ కష్టపడి సంపాదించిన డబ్బును ప్రీమియంగా చెల్లిస్తారన్నారు. అవసరానికి అందుతాయని ఆశిస్తారన్నారు. సాంకేతిక సమస్యల్లో చిక్కుకు పోవడాన్ని హర్షించరన్నారు. ప్రతి క్లెయిమ్ తమ దృష్టిలో ఒక కుటుంబం దురదృష్టకర పరిస్థితిని, ఆసుపత్రి చేరికను, పెరుగుతున్న వైద్య ఖర్చులను సూచిస్తాయన్నారు. ఆ భారాన్ని తగ్గించడమే ఆరోగ్య బీమా ఉద్దేశమన్నారు. ఏ క్లెయిమ్ అన్యాయంగా తిరస్కరించబడకుండా లేదా నిలిచిపోకుండా చూస్తామన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పిల్లలు పెంపొందించుకోవాలి

- ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకుంటేనే జీవితంలో ఉన్నతస్థాయికి : చావ రవి
- సృజనాత్మకతను వెలికితీసే రంగస్థలం బాలోత్సవం : సిఐ ఉపేంద్ర
- ప్రముఖ లైబ్రరీలలో ఎస్వికె లైబ్రరీ ఒకటి : ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిల్లలు చిన్నప్పటి నుంచే ప్రశ్నించే తత్వాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని, సేవా తత్వాలను పెంపొందించుకోవాలని ఎస్టిఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి చావ రవి పిలుపునిచ్చారు. అప్పుడే పిల్లలు ఉన్నతస్థాయికి ఎదుగుతారని చెబుతూ అబ్దుల్ కలాం, సుందరయ్య జీవితచరిత్రలను ఉదహరించారు. శుక్రవారం హైదరాబాద్లోని గచ్చిబౌలిలో గల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బాలోత్సవం ముగింపుసభను ఎస్వికె ట్రస్టు కార్యదర్శి పి ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. హైస్కూల్ విభాగంలో వ్యాసరచన, క్విజ్, నృత్యప్రదర్శనల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కారపు వెంకటరమణ నిర్వహించిన మ్యాజిక్ షో పిల్లలను ఆద్యంతం ఆకట్టుకుంది. సభనుద్దేశించి చావ రవి మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల పిల్లల్లోని టాలెంట్ను వెలికి తీసేందుకు ఎస్వికె చేస్తున్న ప్రయత్నం బాగుందని కొనియాడారు. పిల్లలు చిన్ననాటి నుంచే ప్రతి అంశాన్ని ఎందుకు? ఏమిటి? ఎలా? అని ప్రశ్నలు వేసుకుంటూ అధ్యయనం చేయాలని సూచించారు.

సిఐ ఉపేంద్ర మాట్లాడుతూ..సృజనాత్మకతను వెలికితీసే రంగస్థలం బాలోత్సవం అని కొనియాడారు. పిల్లలు కష్టపడేతత్వాన్ని అలవర్చుకోవాలనీ, ప్రతి రోజూ అరగంట నుంచి గంట వరకు శారీరక శ్రమ చేయాలని సూచించారు. ఏ రంగం ఎంచుకున్నా కఠోరంగా శ్రమిస్తే ప్రతి పిల్లవాడూ మరో ఉసేన్బోల్ట్, థామస్ అల్వా ఎడిషన్, అంబేద్కర్, సచిన్ లాగా జీవితంలో ఎదుగుతారని భరోసానిచ్చారు. లండన్ లైబ్రరీ అతి పెద్దదని, దాన్ని ఎక్కువగా ఉపయోగించున్న అంబేద్కర్, కారల్ మార్క్స్లు ప్రపంచ మేధావులుగా ప్రసిద్ధిచెందారని గుర్తుచేశారు. బ్రూనో, సొక్రటీస్, గెలీలియో, భగత్సింగ్, గాంధీ జీవిత చరిత్రల గురించి ప్రస్తావించారు. పిల్లలంతా పుస్తక పఠనంపై దృష్టి సారించాలనీ, ఫోన్లను దూరం పెట్టాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎస్వికె ట్రస్టు కార్యదర్శి పి ప్రభాకర్ మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సాధారణమని, ఓటమిని గెలుపునకు పునాదిగా మల్చుకోవాలని పిల్లలకు సూచించారు. బాలోత్సవం విజయవంతానికి కృషిచేసిన టీచర్లకు ధన్యవాదాలు తెలిపారు. గచ్చిబౌలి సమీపంలోని పది ప్రభుత్వ పాఠశాలల్లో, బస్తీల్లో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉచితంగా ట్యూషన్లను నిర్వహిస్తున్నామని తెలిపారు, ఎవరైనా సంప్రదిస్తే మరిన్ని బస్తీల్లో ట్యూషన్లను పెట్టడానికి తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. గచ్చిబౌలి ఎస్వీకే లైబ్రరీలో తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో మూడు లక్షల పుస్తకాలున్నాయనీ, వాటిని పిల్లలు,పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యేవారు ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రతినెలా మొదటి ఆదివారం ఎస్వికె ఆధ్వర్యంలో 600 నుంచి 700 మంది పేదలకు అందిస్తున్న ఉచిత వైద్యసేవల గురించి వివరించారు. పుచ్చలపల్లి సుందరయ్య తన భూములను పేదలకు పంచారనీ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. లోక్సభలో తొలి ప్రతిపక్ష నేత సుందరయ్య అనీ, ఆయన మాట్లాడుతుంటే అప్పటి ప్రధాని నెహ్రూ ప్రతి అంశాన్ని నోట్ చేసుకునే వారని తెలిపారు. దేశంలో కుల, మత, డబ్బు రాజకీయాలుండొద్దనీ, సమసమాజం రావాలని కోరుకున్న వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. ఎంఇఒ వెంకటయ్య మాట్లాడుతూ..చదువుతో పాటు క్రీడల్లోనూ పిల్లలు రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాలోత్సవం కన్వీనర్ సి విజయ్కుమార్, ఎస్వికెకు చెందిన ఆర్ సాంబశివరావు, రవి, అనిల్, శ్రీనివాస్, మంజూల, పాల్గొన్నారు.

ఘనంగా గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ 12వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ : క్యాన్సర్ అవగాహన, ప్రాథమిక నిర్ధారణ, చికిత్స సహాయం, పునరావాసం, పరిశోధనలకు అంకితమైన ఎన్జిఓల్లో ఒకటైన గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ గురువారం రాత్రి దాని 12వ వార్షికోత్సవాన్ని జూబ్లీహిల్స్లో ఘనంగా నిర్వహించింది. దీనికి ఆ సంస్థ ఫౌండర్ డా. చినబాబు సుంకవల్లి హాజరై మాట్లాడుతూ.. 2026 ఫిబ్రవరి నుండి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలను అమలు చేయడానికి మేఘాలయ మరియు త్రిపుర రాష్ట్ర ప్రభుత్వాలతో రెండు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఆధునిక పరిశోధనల ద్వారా క్యాన్సర్ నిర్మూలన వైపు కదిలే సమగ్ర ఆరోగ్య ఉద్యమంగా ఎదిగిందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్, తెలంగాణ మాజీ సిఎస్ శైలేంద్ర కుమార్, హైదరాబాద్లోని బ్రిటిష్ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ హాజరయ్యారు. డాక్టర్ చినబాబు క్యాన్సర్ లేని సమాజం కోసం శస్త్రచికిత్స వైద్యుడిగా పనిచేస్తున్నట్లే, మేము హైడ్రాలో సమాజంలోని ట్యూమర్లనుఆక్రమణదారులను తొలగిస్తూ ప్రభుత్వ ఆస్తులను రక్షిస్తున్నామని రంగనాథ్ అన్నారు.. ప్రజల భద్రత, సమృద్ధి, సుస్థిరత కోసం పనిచేస్తున్నామన్నారు.

మార్కెట్లోకి రెడ్మీ15సి 5జి విడుదల



హైదరాబాద్ : ప్రముఖ స్మార్ట్ఫోన్ ఉత్పత్తుల కంపెనీ షావోమి శుక్రవారం హైదరాబాద్లో తన కొత్త రెడ్మీ 15సి 5జి మోడల్ను విడుదల చేసింది. 6000 ఎంఎహెచ్ బ్యాటరీ కలిగిన దీని ప్రారంభ ధరను రూ.12,499గా నిర్ణయించింది. దీనికి 17.53 సెంటీమీటర్ల పెద్ద డిస్ప్లే, 33వాట్ ఫాస్ట్ చార్జింగ్, క్వాడ్-కర్వ్డ్ స్లీక్ డిజైన్ ఉంది. ఈ బడ్జెట్ ఫోన్ డిసెంబర్ 11 నుండి అమ్మకానికి వస్తుందని షావోమి ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అనూజ్ శర్మ తెలిపారు. పెద్ద డిస్ప్లే, భారీ బ్యాటరీ, సొగసైన డిజైన్ కలయిక దీని ప్రత్యేకతన్నారు. 50ఎంపి కెమెరా సహా 8ఎంపి సెల్ఫీ కెమెరాతో దీన్ని అందిస్తున్నామన్నారు.

ఇసుజు ఐ-కేర్ వింటర్ క్యాంప్

హైదరాబాద్ : ఇసుజు మోటార్స్ ఇండియా దేశవ్యాప్తంగా 'ఇసుజు ఐ-కేర్ వింటర్ క్యాంప్' ప్రకటించింది. దీంతో వినియోగదారులు ప్రస్తుతం ఉన్న సర్వీస్ ప్రయోజనాలను ఇసుజు ఆధికృత డీలర్ సర్వీస్ అవుట్లెట్స్ వద్ద డిసెంబర్ 8 నుండి 13 వరకు అందుకోవచ్చని తెలిపింది. ఇందులో నిర్వహణ పరీక్షలు అందించడం ఈ సర్వీస్ క్యాంప్ లక్ష్యమని ఆ సంస్థ తెలిపింది. ఇందులో ఉచితంగా 37 పాయింట్ చెక్అప్లు లభిస్తాయని పేర్కొంది. విడిభాగాలపై 5 శాతం, లేబర్ ఛార్జీలపై 10 శాతం తగ్గింపును ఇస్తోన్నట్లు తెలిపింది.

సాయి ఈశ్వర్ది ప్రభుత్వ హత్యే

- ఆ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలి
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసానికి సాయి ఈశ్వర్ అనే యువకుని నిండు ప్రాణం బలైందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కెటిఆర్) తెలిపారు. ఆయనది ఆత్మహత్య కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్య అని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీకి కాంగ్రెస్ సర్కారు తూట్లు పొడవడాన్ని తట్టుకోలేకే ఆత్మాహుతి చేసుకున్నాడని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లు కేవలం 17 శాతానికే కుదించిన ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి రాష్ట్రంలో బిసిలకు వెన్నుపోటు పొడిచారని పేర్కొన్నారు. ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యేనని తెలిపారు. సిఎం రేవంత్రెడ్డితోపాటు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా ఈ మరణానికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కులగణన మొదలుకుని న్యాయస్థానాల్లో నిలబడని జిఒల దాకా కాంగ్రెస్ ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా కామారెడ్డి డిక్లరేషన్కు సమాధి కట్టిందని విమర్శించారు. బాధితుని కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.బిసి రిజర్వేషన్ల పేరుతో రేవంత్రెడ్డి ఆడిన రాక్షస రాజకీయ క్రీడలో సాయి ఈశ్వర్ బలైపోవడం తీవ్రంగా కలిచివేసిందని మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్రావు తెలిపారు. బిసి బిడ్డ ఆత్మబలిదానానికి కారణమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బిసి సమాజం ఎన్నటికీ క్షమించదని పేర్కొన్నారు.

సాయిఈశ్వర్ భౌతికకాయానికి బిఆర్ఎస్ నివాళి

బిసి రిజర్వేషన్లపై ఆత్మహత్యకు పాల్పడిన సాయి ఈశ్వర్ భౌతికకాయాన్ని సందర్శించి బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్, శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీమంత్రి శ్రీనివాస్గౌడ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

నాడు శ్రీకాంతాచారి... నేడు సాయి ఈశ్వర్ బలి

నాడు తెలంగాణ ఇవ్వకుండా శ్రీకాంతాచారి, నేడు బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా సాయి ఈశ్వర్ను కాంగ్రెస్ బలి తీసుకుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్రెడ్డి తెలిపారు. పోరాడి హక్కులను సాధించుకుందామని, ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడొద్దని కోరారు. సాయిఈశ్వర్ మరణం కలచివేసిందని బిఆర్ఎస్ ఎంపి వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, మాజీ సభ్యులు కిశోర్గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ మోసానికి బిసిలు ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని కోరారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE AT VISAKHAPATNAM
I.A. No. 2393/2025 IN O.S. No. 136/2024

Between:
M/s. Sri Sai Builders ...Petitioner/Plaintiff
And:
1. Arun Kumar Bhutra (Died) . . . Respondent/Defendant
2. Smt. Madhu Bhutra. ....Respondent/Proposed 2nd Defendant

NOTICE BY PUBLICATION

To:
Smt. Madhu Bhutra,W/o late Arun Kumar Bhutra, aged about 52 years, residing at Door No 3-6-309/1/44A, Skylark Apartments, Avanti Nagar, Basheerbagh, Himayath Nagar, Hyderabad-500 029.

Take Notice that the Petitioner/Plaintiff, M/s Sri Sai Builders, has filed the aforementioned **I.A. No. 2393/2025** in the suit **O.S. No. 136/2024.** The application has been filed to add you as the Legal Representative (L.R.) of the deceased Defendant, Arun Kumar Bhutra. The Hon'ble Court has directed the service of notice upon you by way of publication, as you are here by directed to appear before the Honourable Court of the Principal District and Sessions Judge at Visakhapatnam on **29-12-2025 at 10.30 A.M.** either personally or through an Advocate, to respond to the said please note that if you fail to appear, the Court may proceed with the hearing and pass necessary orders in your absence.

KANDREGULA JAGADHESWARARAO
Advocate, Visakhapatnam.
Date: 03-12-2025

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE AT VISAKHAPATNAM
I.A.No. 328/2025 IN OS. No. 136/2024

Between:
M/s. Sri Sai Builders . . . Petitioner/Plaintiff
And:
1. Arun Kumar Bhutra (Died) ... Respondent Defendant
2. Smt. Madhu Bhutra, . . . Respondent/Proposed 2nd Defendant

NOTICE BY PUBLICATION

To:
Smt. Madhu Bhutra W/o late Arun Kumar Bhutra, aged about 52 years, Residing at Door No 3-6-309/1/44A, Skylark Apartments, Avanti Nagar, Basheerbagh, Himayath Nagar, Hyderabad-500 029.

Take Notice that the Petitioner/Plaintiff, M/s Sri Sai Builders. has filed the aforementioned **I.A. No. 328/2025** in the suit **O.S. No. 136/2024** The application has been filed to condone the delay in filing the application for adding the L.R. The Hon'ble Court has directed the service of notice upon you by way of publication, as you are here by directed to appear before the Honourable Court of the Principal District and Sessions Judge at Visakhapatnam on **29-12-2025 at 10.30 A.M.** either personally or through an Advocate, to respond to the said I.A. please note that if you fail to appear, the Court may proceed with the hearing and pass necessary orders in your absence.

KANDREGULA JAGADHESWARARAO
Advocate, Visakhapatnam.
Date: 03-12-2025

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE AT VISAKHAPATNAM
I.A. No. 2394/2025 in O.S. No. 136/2024

Between:
M/s. Sri Sai Builders ...Petitioner/Plaintiff
And:
1. Arun Kumar Bhutra (Died) ....Respondent/Defendant
2. Smt. Madhu Bhutra, ...Respondent/Proposed 2nd Defendant

NOTICE BY PUBLICATION

To:
Smt. Madhu Bhutra,W/o late Arun Kumar Bhutra, aged about 52 years, residing at Door No 3-6-309/1/44A, Skylark Apartments, Avanti Nagar, Basheerbagh, Himayath Nagar, Hyderabad-500 029.

Take Notice that the Petitioner/Plaintiff, M/s Sri Sai Builders, has filed the aforementioned **I.A. No. 2394/2025** in the suit **O.S. No. 136/2024.** The application has been filed to set aside the order of abatement. The Hon'ble Court has directed the service of notice upon you by way of publication, as you are here by directed to appear before the Honourable Court of the Principal District and Sessions Judge at Visakhapatnam on **29-12-2025, at 10.30 A.M.** either personally or through an Advocate, to respond to the said I.A. please note that if you fail to appear, the Court may proceed with the hearing and pass necessary orders in your absence.

KANDREGULA JAGADHESWARARAO
Advocate, Visakhapatnam.
Date: 03-12-2025

సిఐటియు మహాసభకు ముస్తాబు

- మెతుకుసీమలో గళమెత్తనున్న కార్మికవర్గం
- 7న భారీ బహిరంగ సభ
- హాజరుకానున్న హేమలత, బివి రాఘవులు
- మెదక్ జిల్లాలో భారీ ఏర్పాట్లు చేసిన ఆహ్వాన సంఘం

మహాసభకు ఏర్పాట్లుపై మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెతుకు సీమలో జరగనున్న సిఐటియు రాష్ట్ర మహాసభలకు మెదక్ పట్టణాన్ని ముస్తాబు చేశారు. మహాసభల విస్తృత ప్రచారం కోసం మెదక్ పట్టణంలో వాల్ రైటింగ్, కరపత్రాలు, వాల్ పోస్టర్ల ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. జిల్లాలోని శ్రామిక మహిళలు మహాసభల జయప్రదానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో జరిగే రాష్ట్ర 5వ మహాసభలకు ఆహ్వాన సంఘం భారీ ఏర్పాట్లు చేసింది. మూడు రోజుల పాటు జరిగే ప్రతినిధుల మహాసభకు మెదక్ జిల్లా కేంద్రంలోని వినాయక కన్వెన్షన్ హాల్‌ను సిద్ధం చేశారు. ఈ మహాసభకు 33 జిల్లాల నుంచి 600 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. 7వ తేదీన మధ్యాహ్నం మెదక్ చిల్డ్రన్ పార్క్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నారు. మెదక్ జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి అసంఘటిత రంగ కార్మికులు, స్కీం వర్కర్లు, గ్రామ పంచాయతీ కార్మికులు.. తదితరులు తరలిరానున్నారు. జిల్లాలోని కార్మికులు మహాసభకు విరాళాలు ఇచ్చి సహకరిస్తున్నారు.

మెదక్ జిల్లాలో 21 మండలాలు, 73 సిఐటియు అనుబంధ సంఘాల సహకారంతో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా 492 గ్రామ పంచాయతీల్లో సిఐటియు గ్రామ సమన్వయ కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ కమిటీల ద్వారా నిధులు సేకరించడంతో పాటు ప్రచారమూ చేస్తున్నారు. అదే విధంగా సమకాలీన సమస్యలపై సెమినార్లు జరిపారు. 7న నిర్వహించే బహిరంగ సభకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, సిఐటియు జాతీయ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ హేమలత, తపన్‌సేన్, కోశాధికారి సాయిబాబు హాజరుకానున్నారు. అదే విధంగా రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఆఫీస్ బేరర్స్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొంటారు.

మహాసభ సందర్భంగా సెమినార్ల నిర్వహణ..

మహాసభల సందర్భంగా సమకాలీన అంశాలపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సెమినార్లు నిర్వహించారు. లేబర్ కోడ్స్.. కార్మికులపై ప్రభావం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు బీడీ కార్మికులపై ప్రభావం, ప్రభుత్వ ఉద్యోగాలు- మధ్య తరగతి ఉద్యోగులపై ప్రభావం, మున్సిపల్, గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు-ప్రభుత్వాల కృషి, స్కీం వర్కర్ల సమస్యలు.. తదితర అంశాలపై సెమినార్లు, సదస్సులు నిర్వహించారు.

మెదక్‌లో సభ జరపడం కొత్త అనుభవం : సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

అసంఘటిత కార్మికుల మధ్య సభ జరపడం సిఐటియుకు కొత్త అనుభవాన్ని ఇస్తుంది. అసంఘటిత రంగ కార్మికులంతా సిఐటియునే తమ సంఘంగా భావిస్తూ రెండు, మూడు నెలలుగా కష్టపడి మహాసభలను జయప్రదం చేయడం కోసం చేస్తున్న కృషి అభినందనీయం. మెదక్ జిల్లాలో 492 గ్రామ పంచాయతీలు ఉంటే అన్ని గ్రామ పంచాయతీల్లో సిఐటియు గ్రామ సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ మహాసభకు 33 జిల్లాల నుంచి ప్రతినిధులు 600 మంది హాజరవుతారు. మహాసభ సందర్భంగా మెదక్ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సిఐటియు జెండావిష్కరణలు చేశారు.

కొత్త సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో మాట్లాడుతున్న కెసిఆర్

రానున్నది బిఆర్ఎస్ ప్రభుత్వమే

- కెసిఆర్ దత్తత గ్రామాలు ఏకగ్రీవం..
- కొత్త సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో ఫాంహౌస్‌లో భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మళ్ళీ వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని.. నాడు ఎర్రవల్లి, నర్సన్నపేట గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకుందామని దత్తత గ్రామాల సర్పంచ్‌లకు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ దత్తత తీసుకున్న గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవెల్లి, నర్సన్నపేట గ్రామపంచాయతీల్లో బిఆర్ఎస్ మద్దతుదారులను సర్పంచ్ అభ్యర్థులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులను కెసిఆర్ ఫామ్‌హౌస్‌కు ఆహ్వానించి అభినందనలు తెలిపారు. వారిని శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కెసిఆర్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధియే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని తెలిపారు. ప్రతి వార్డు మెంబర్ గ్రామ ప్రజలతో మమేకమై కలిసి గ్రామ అభివృద్ధి దిశలో ముందుండాలని సూచించారు. కెసిఆర్‌ను కలిసిన వారిలో.. ఎర్రవల్లి, నర్సన్నపేట ఏకగ్రీవమైన సర్పంచులు కవిత రాంమోహన్ రెడ్డి, గిల్కా బాలనర్సయ్య, మాజీ సర్పంచ్ కమ్మరి బాలరాజు, బిఆర్ఎస్ నాయకులు కిష్టారెడ్డి, బీంరెడ్డి బాల్‌రెడ్డి, కనకరాజు యాదవ్, రాంరెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, గీసు మల్లేశం, పరాశురాం తదితరులున్నారు.

భిక్షాటన చేస్తున్న బానోత్ బద్రి

నామినేషన్ ఫీజు కోసం సర్పంచ్ అభ్యర్థి భిక్షాటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం కాకర్ల గ్రామ పంచాయతీలో సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన బానోత్ బద్రి నామినేషన్ ఫీజు కోసం శుక్రవారం భిక్షాటన చేపట్టారు. సేకరించిన డబ్బులతో సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు. మండలంలోని దుబ్బతండాకు చెందిన బానోత్ బద్రి, ఆమె భర్త శ్రీను స్థానికుల సహకారంతో పంచాయతీ స్థానానికి పోటీ చేస్తున్నారు. 2019లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాకర్ల సర్పంచ్ స్థానానికి బరిలో నిలిచిన బద్రి 506 ఓట్లు సాధించి ఓటమి పాలయ్యారు.

ఈ-వేలంతో రూ.3,862 కోట్లు

- ముగిసిన కోకాపేట నియోపోలిస్ వెంచర్ వేలంపాట

ప్రజాశక్తి - హైదరాబాద్(హెచ్ఎండిఎ)

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ నియోపోలిస్ భూ వేలం విజయవంతంగా పూర్తి అయినట్టు హెచ్ఎండిఎ అధికారులు వెల్లడించారు. హెచ్ఎండిఎ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం హెచ్ఎండీఏ నిర్వహించిన ఈ-వేలంలో 1.98 ఎకరాల గోల్డెన్ మైల్ స్థలాన్ని కోయస్ ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్ ప్రయివేట్ లిమిటెడ్ దక్కించుకుంది. ఈ కంపెనీ ఒక్క ఎకరాకు రూ.77.75 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ స్థలం ప్రత్యేక ఆకారంలో ఉండటంతో దీనికి మంచి రేటు పలికినట్టు అధికారులు తెలిపారు. ఈ వేలం ద్వారా హెచ్ఎండిఎకు మొత్తం రూ.3,862.8 కోట్ల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. మెట్రోపాలిటన్ ప్రాంతంలో సముచిత స్థలాలకు ఎంత డిమాండ్ ఉందో ఈ-వేలం ద్వారా స్పష్టం అవుతోందని అన్నారు. హైదరాబాద్‌ను భారతదేశంలో అత్యంత ఆకర్షణీయమైన రియల్ ఎస్టేట్ పెట్టుబడి గమ్యస్థానాల్లో ఒకటిగా ఈ ఫలితాలు మరింత బలపరుస్తాయని అభిప్రాయపడ్డారు.

త్వరలో సాయి పేరెంటరల్స్ పబ్లిక్ ఇష్యూ

- సెబీకి డిఆర్‌హెచ్‌పి సమర్పణ
- ఎండి అనిల్ కెకె వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ : నగర కేంద్రంగా పని చేస్తోన్న ఔషధ ఉత్పత్తుల కంపెనీ సాయి పేరెంటరల్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు సిద్ధమవుతోంది. ఇందుకోసం ఇప్పటికే సెబీకి ప్రతిపాదిత పత్రాల (డిఆర్‌హెచ్‌పి)ను అందజేసినట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కెకె తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అనిల్ మాట్లాడుతూ.. సాయి పేరెంటరల్స్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ) కోసం ఇప్పటికే సెబీ, బిఎస్ఇ, ఎన్ఎస్ఇ అధికారులు అడిగిన పలు అంశాలకు వివరణలు ఇచ్చామన్నారు. తుది దశలో ఉందని.. త్వరలోనే తమ ఐపిఒకు అనుమతులు రావొచ్చని ఆశిస్తున్నామన్నారు. ఈ ఇష్యూలో ఫ్రెష్ ఈక్విటీ ద్వారా రూ.285 కోట్లు, ఒఎఫ్ఎస్ ద్వారా రూ.125 కోట్లు.. మొత్తంగా రూ.410 కోట్ల నిధులు సమీకరించనున్నట్లు తెలిపారు. ఇందులో రూ.110 కోట్లను తమ నాలుగు ప్లాంట్ల ఆధునీకరణకు, ఆర్‌అండ్‌డి కోసం రూ.26 కోట్లు వ్యయం చేయనున్నామని చెప్పారు. కొంత మొత్తాన్ని అంతర్జాతీయ మార్కెట్‌లో తమ కార్యకలాపాల విస్తరణకు ఉపయోగించనున్నామని తెలిపారు. ఇటీవల ఆస్ట్రేలియాకు చెందిన నౌమెడ్ ఫార్మాస్యూటికల్స్‌లో 74.6 శాతం వాటాను రూ.125 కోట్లకు కొనుగోలు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇది ఆస్ట్రేలియాలోని తమ క్లయింట్ల అవసరాలను తీర్చనుందన్నారు. అక్కడ నూతన తయారీ ప్లాంట్‌ను వచ్చే ఏడాది అందుబాటులోకి తేనున్నామని చెప్పారు. దీని స్వాధీనంతో నౌమెడ్ ఆర్‌అండ్‌డి సామర్థ్యాలు, పంపిణీ నెట్‌వర్క్, ఉత్పత్తుల విస్తృత శ్రేణి, రాబోయే తయారీ ప్రాజెక్టులు సాయి పేరెంటరల్స్‌కు అధ్వర్యంలోకి రానున్నాయన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

జై భీం సినిమాను తలపించేలా కోదాడ ఘటన

- దళిత యువకుడిది ముమ్మాటికీ పోలీసుల హత్యే : మందకృష్ణ మాదిగ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కోదాడ పట్టణంలో దళిత యువకుని మృతి ఘటన జైభీం సినిమాను తలపించేలా ఉందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ అన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత యువకున్ని అకారణంగా ఓ కేసులో విచారణ పేరుతో పోలీసులు తీసుకెళ్లి హత్య చేశారని ఆరోపించారు. దీనిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్‌సి కమిషన్ ప్రత్యేక బృందంతో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విచారణ చేయించాలని కోరారు. విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత పోలీసు అధికారులను తక్షణమే విధుల నుంచి తప్పించాలన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో స్థానిక ఎన్నికలు ఉన్నాయని, అయితే బ్రిటిష్ కాలం నాటి 'థర్డ్ యాక్టు'ను ఉపయోగించి అధికారులు తప్పిదాలను కప్పిపుచ్చుకోవడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహ, శివ కుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎన్నికల బహిష్కరణ

- బుగ్గకాలువ తండా వాసుల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోడ్డు సౌకర్యం కల్పించాలని బుగ్గ కాలువ తండా వాసులు నిరసన వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని చెదురపల్లి గ్రామపంచాయతీ బుగ్గ కాలువ తండాకు రోడ్డు సౌకర్యం కల్పించే వరకు ఎన్నికల్లో పాల్గొనబోమంటూ శుక్రవారం గ్రామ యువకులు బ్యానర్ పట్టుకుని నిరసన తెలిపారు. రోడ్డు, డ్రైనేజీ, నీటి సమస్య పరిష్కారం, వీధి దీపాలు, బస్సు సౌకర్యం కల్పించాలంటూ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ కుమార్, ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఎన్నికల బహిష్కరణ పేరుతో బ్యానర్లు ప్రదర్శిస్తూ ధర్నా నిర్వహించారు.

ఎంవిఎన్ జీవితం ఆదర్శనీయం

- ఉచిత మోకాలు చిప్ప ఆపరేషన్లు చేయడం అభినందనీయం : డాక్టర్ పుల్లారావు
- ఆయన స్ఫూర్తిని కొనసాగించేందుకే సేవా కార్యక్రమాలు : డాక్టర్ అరుణ్‌రెడ్డి

ఎంవిఎన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సాయుధ పోరాట యోధులు, సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు మల్లు వెంకట నరసింహారెడ్డి జీవితం అందరికీ ఆదర్శనీయమని మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ పుల్లారావు అన్నారు. ఆయన అందించిన పోరాట స్ఫూర్తిని, మానవతా విలువలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. మల్లు వెంకట నరసింహారెడ్డి 24వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం నల్లగొండలోని సత్యావతి ఆస్పత్రిలో ఎంవిఎన్ మనవడు, ఆర్థోపెడిక్ డాక్టర్ మల్లు అరుణ్‌రెడ్డి ఆధ్వర్యంలో 94 సంవత్సరాల వృద్ధుడికి ఉచిత మోకాలు చిప్ప మార్పిడి ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవిఎన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ పుల్లారావు మాట్లాడుతూ.. ఎంవీఎన్ జీవితమంతా త్యాగాలమయమని, జీవితాంతం నిరుపేదల అభ్యున్నతి కోసం పరితపించారని గుర్తు చేశారు. ప్రతి ఏడాదీ ఆయన వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఉచిత మోకాలు మార్పిడి ఆపరేషన్ అభినయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని కోరారు.

ఆర్థోపెడిక్ వైద్యులు మల్లు అరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంవిఎన్ తన జీవితాంతం అట్టడుగు వర్గాల కోసం పనిచేశారన్నారు. గొప్ప వ్యక్తుల స్ఫూర్తిని ముందుకు తీసుకుపోయేందుకు ఇలాంటి కార్యక్రమం దోహదపడుతుందని భావిస్తున్నట్టు చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్‌లోనూ మరింత ముందుకు తీసుకుపోతామని, ఇందుకు సంపూర్ణ సహకారం అందిస్తున్న సత్యవతి ఆస్పత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆస్పత్రి ఎండి డాక్టర్ రాంమనోహర్ మాట్లాడుతూ.. మల్లు వెంకట నరసింహారెడ్డి స్ఫూర్తిగా ఇలాంటి కార్యక్రమాలు చేయడం చాలా సంతోషకరమన్నారు. అందులో తమ ఆస్పత్రి భాగస్వామ్యం కావడం ఇంకా సంతోషంగా ఉన్నదన్నారు. తాము కూడా అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నామని చెప్పారు. ఎంవిఎన్ విజ్ఞాన కేంద్రం కార్యనిర్వాహక కార్యదర్శి పి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో ప్రతినెలా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని చెప్పారు. డాక్టర్ అరుణ్‌కు, సత్యవతి ఆస్పత్రి యాజమాన్యానికి ఎంవిఎన్ విజ్ఞానకేంద్రం తరపున ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. వైద్య సేవలు కాకుండా విద్యార్థులకు కరాటే, ఉచిత కంప్యూటర్ శిక్షణ, మహిళలకు టైలరింగ్, క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నీలగిరి అధ్యక్షులు డాక్టర్ రమేష్, మాజీ అధ్యక్షులు డాక్టర్ అనితారాణి, డాక్టర్ చైతన్య, డాక్టర్ సంపద, సత్యవతి వైద్యశాల ఎండి సత్యనారాయణ, కంప్యూటర్ శిక్షణా కేంద్రం ఫ్యాకల్టీ శంకర్ పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో నవజాత శిశువు మృతి

- డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో అప్పుడే పుట్టిన శిశువు మృతి చెందింది. దాంతో ఆస్పత్రి ఎదుట బాధిత కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకెళ్తే.. వనస్థలిపురంలోని చింతలకుంటలో నివాసం ఉంటున్న గర్భిణి సమీనా ఈ నెల 3న ప్రసవం కోసం వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో చేరింది. శుక్రవారం తెల్లవారుజామున మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే, ఏమైందో ఏమో నవజాత శిశువు మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ శిశువు మృతిచెందాడని ఆరోపిస్తూ వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ.. శిశువు చనిపోవడం వాస్తవమేనని, దానిపై ఒక కమిటీ వేసి.. ఘటనపై విచారణ జరిపి.. చర్యలు తీసుకుంటామని అన్నారు.

'గోకారం'లో ముంచొద్దు..

- పురోగతి లేని పునరావాసం
- వేల ఎకరాలు నీటిలో మునక
- రిజర్వాయర్ సామర్థ్యం తగ్గించాలని రైతుల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వేసవిలోనూ దుందుబీ నది నుంచి కాల్వల ద్వారా పంట పొలాలకు మళ్లించి సాగు చేసేవాళ్లం.. ఇంటికి ఒకరు చొప్పున వచ్చి కాల్వల్లో ఇసుకను తీసి పారించేవాళ్లం. వరి, కూరగాయలు, వేరుశనగ, పప్పుశనగ వంటి పంటలు సాగు చేసుకునే వాళ్లం.. ఇప్పుడు సాగునీటి ప్రాజెక్టుల పేరుతో మా పంట పొలాలను రిజర్వాయర్‌లో ముంచుతున్నారు.. దానికి సరైన పరిహారం కూడా ఇవ్వడం లేదు.. రెండేళ్ల నుంచి పోరాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వ్యవహరిస్తోంది.. గోకారం-ఎర్రవల్లి రిజర్వాయర్ సామర్థ్యంతోపాటు ముంపు తగ్గించి 2013 జీఓ ప్రకారం పరిహారం చెల్లించాలి.. అంటూ రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చారకొండ, ఎర్రవల్లి సమీపంలో గోకారం రిజర్వాయర్ నిర్మిస్తే.. వేల ఎకరాల పంట భూములు ముంపుకు గురవుతాయి. ఏదుల రిజర్వాయరు నుంచి నీటిని మళ్లించి ఉల్పర, చారకొండ మీదుగా నల్లగొండకు నీరు వెళ్లాల్సి ఉంది. ఇప్పటికే టన్నెల్ పనులు పూర్తయ్యాయి. కాల్వల నిర్మాణం పూర్తి కావచ్చింది. ఇక రిజర్వాయర్ మొత్తం పూర్తయితే నీటి తరలింపు ప్రారంభమవుతుంది. కానీ, గోకారం రిజర్వాయరు నిర్వాసితులకు పరిహారం ఇస్తేనే పనులు ముందుకు సాగే అవకాశం ఉంది. ప్రభుత్వం పదెకరాల భూమికి ఇచ్చే పరిహారంతో మరో చోట ఎకర పొలం కూడా రాదు. 1673 ఎకరాల్లో ఒక టీఎంసీ నీటి నిల్వ ఉండేలా గోకారం రిజర్వాయర్ నిర్మాణం చేయడానికి పనులు జరుగుతున్నాయి. రైతులకు పరిహారం ఇవ్వకముందే గుత్తేదారు గోకారం చెరువు నీటిని బయటకు తీయడానికి గండి పెట్టారు.

దీంతో చెరువులో నీటి నిల్వ లేకుండా బయటకు పోతోంది. అందువల్ల 570 ఎకరాల ఆయకట్టు ఎండిపోతుండగా.. 140 మత్స్యకార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయి. రిజర్వాయర్‌లో 300 మంది రైతులకు చెందిన గోకారం శివారులో 870 ఎకరాలు, ఎర్రవెల్లికి చెందిన 593 ఎకరాలు, బైరాపూర్‌కు చెందిన 197 ఎకరాలు, జేపల్లికి 11 ఎకరాలు ముంపునకు గురవుతాయని గుర్తించారు. ఇళ్లు మునగనున్నాయి. మరోవైపు భూసేకరణలో భాగంగా పరిహారం ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దీంతో ఇటు భూములు అమ్ముకునే అవకాశాలు లేవు. ఎవరైనా అమ్ముదామంటే కొనుగోలు చేసేవారు ముందుకు రావడం లేదు.

ఏడాది కాలంగా ఆందోళన

గోకారం-ఎర్రవల్లి గ్రామపంచాయతీల పరిధిలో నిర్మించే ఈ రిజర్వాయర్ సామర్థ్యం తగ్గించాలని కోరుతూ ఏడాది కాలంగా రైతులు ఆందోళన చేస్తున్నారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రైతులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం దిగొచ్చి పరిహారం చెల్లించడంతోపాటు ప్రాజెక్టు సామర్థ్యం తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం గోకారం విషయంలో విధాన పరమైన నిర్ణయం ప్రకటించేవారకు ఆందోళన విరమించేది లేదంటున్నారు.

మేమెలా బతకాలి..
రైతు లక్ష్మయ్య, గోకారం- చారగొండ మండలం

సాగు చేసుకునే భూములు పోయాయి. బతుకుదెరువు లేకుండా పోయింది. భూములు పోయినంక సాగునీరు వస్తే మాకేంది.. రాకుంటే మాకేంది. పరిహారమన్నా న్యాయంగా ఇవ్వాలని రెండేళ్లుగా కోరుతున్నాం. పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా మా బతుకులను ఆగం చేస్తున్నారు.

2013 ప్రకారం పరిహారం ఇవ్వాలి..
రైతు సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు బాల్‌రెడ్డి

డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న గోకారం రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించాలి. ముంపుకు గురవుతున్న రైతులకు 2013 జిఒ ప్రకారం పరిహారం చెల్లించాలి. బయటి మార్కెట్‌కు మూడింతలు పరిహారమివ్వాలి. లేనిచో భూమికి భూమి ఇచ్చి ఆదుకోవాలి. పరిహారం ఇవ్వడంలో జాప్యం చేస్తే.. రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదు.

పాలసీ ప్రకారం ముందుకు వెళ్తున్నాం..
డిండి ప్రాజెక్టు డిఇ జ్ఞానేశ్వర్

పరిహారం పెంచాలని, రిజర్వాయర్ డిజైన్ మార్చాలని రైతులు కోరుతున్నారు. వారి డిమాండ్ న్యాయమైనదే కావచ్చు కానీ, ప్రభుత్వ విధానాన్ని మేం మార్చలేము. ఏదైనా ప్రభుత్వం నుంచి ప్రకటన రావాల్సి ఉంది. మేము ఇచ్చిన డిపిఆర్ ప్రాసెస్ ప్రకారం ముందుకెళ్తున్నాం.

శిశువును చూపిస్తూ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు

ప్రభుత్వ ఆస్పత్రిలో 4 కిలోల మగ శిశువు జననం

- వైద్య బృందాన్ని అభినందించిన మెడికల్ సూపరింటెండెంట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ వైద్య విధాన పరిషత్ కింగ్ కోఠి జిల్లా ప్రభుత్వ దవాఖానాలో ఓ గర్భిణి సాధారణ ప్రసవం ద్వారా నాలుగు కిలోల మగ శిశువుకు జన్మనిచ్చింది. అయితే మొదటి కాన్పుకు సర్జరీ అయ్యి, రెండో కాన్పుకు నార్మల్ డెలివరీ ద్వారా ఇంత బరువు గల శిశువు జన్మించడం ఆస్పత్రిలో ఇదే తొలిసారి అని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సంతోష్‌బాబు తెలిపారు. నల్లకుంట అచ్చయ్యనగర్ ప్రాంతానికి చెందిన బి.దుర్గభవానికి పురిటి నొప్పులు రావడంతో భర్త నాగరాజు ఈ నెల 3న కింగ్ కోఠి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చాడని చెప్పారు. వెంటనే గైనిక్ హెచ్ఒడి డాక్టర్ జ్యోతిర్మయి లేబర్ రూమ్‌కు గర్భిణిని తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారన్నారు. అదే రోజు ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఆమె సాధారణ ప్రసవం ద్వారా నాలుగు కిలోల బరువున్న మగ శిశువుకు జన్మనిచ్చిందని తెలిపారు. శిశువు, తల్లి క్షేమంగా ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా హెచ్ఒడి డాక్టర్‌ను, డాక్టర్ సరిత, మెడ్ వైఫ్ సంతోషి, లేబర్ ఇన్‌చార్జి చంద్రలీల, స్టాఫ్ నర్స్ స్వప్నను సూపరింటెండెంట్ డాక్టర్ సంతోష్, ఆర్ఎంఒ డాక్టర్ సాధన అభినందించారు.